# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 71 23-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## అరాద్, డిమోనా నగరాలపై ఇరాన్ దాడులు

- నతాంజ్ అణు కేంద్రంపై దాడికి ప్రతీకారం
- అడ్డుకోవడంలో విఫలమైన ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్
- 180 మందికి గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపైనా ఇరాన్ దాడులు
- ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా తీవ్ర దాడులు, ఒకరి మృతి

దుబాయ్: పశ్చిమాసియా యుద్ధ జ్వాలలు నానాటికీ విస్తరిస్తున్నాయి. దాడులు, ప్రతిదాడులతో ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు దద్దరిల్లిపోతున్నాయి. యుద్ధం ఆదివారం 23వ రోజుకు చేరుకుంది. నతాంజ్ అణు కేంద్రంపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైన్యం హెజ్‌బోల్లా మిలిటెంట్లతో కలిసి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. నెగెవ్ ఎడారిలోని ఇజ్రాయెల్ ప్రధాన అణు పరిశోధన కేంద్రమే లక్ష్యంగా దాడులకు దిగింది. దాని సమీపంలోని అరాద్, డిమోనా పట్టణాలపై బాంబుల వర్షం కురిపించింది. వందల కిలోల వార్‌హెడ్లతో కూడిన బాలిస్టిక్ క్షిపణులను కూడా ప్రయోగించింది. ఈ ఘటనలో కనీసం 180 మందికిపైగా గాయపడినట్లు సమాచారం. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడిలో పలు భవనాలు ధ్వంసమయ్యాయి.

- మిగతా 2వ పేజీలో




## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

- కూల్చడం, నాశనం చేయడమే ఆ పార్టీ డీఎన్ఏ
- పేదల ఇళ్లు కూల్చేసి పునరుజ్జీవం అంటే ఊరుకోం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

## ప్రధాని మోడీ హిస్టరీ క్రియేట్

- మోడీ తన పదవీకాలంలో 8,931వ రోజును పూర్తి చేసుకుని, రికార్డు సృష్టించారు
- భారత్ లో అత్యధిక కాలం పనిచేసిన ప్రభుత్వ అధినేతగా నిలిచారు



ఆదివారం (మార్చి 22, 2026), భారత రాజకీయాల్లో ముఖ్యమైన రోజు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్‌ను అధిగమించి, భారత్ లో అత్యధిక కాలం పనిచేసిన ప్రభుత్వ అధినేతగా నిలిచారు. పవన్ కుమార్ చామ్లింగ్ 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేయగా, ప్రధానమంత్రి మోడీ ఇప్పుడు ప్రభుత్వ

- మిగతా 2వ పేజీలో



## ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమంలో వెనుకంజ వేయం

- ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెరగాలి
- పంట మార్పిడితోనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది
- బంగారు తెలంగాణ అంటే ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమే
- తొలివిడత రైతుభరోసా నిధులు విడుదల చేసిన సీఎం
- నేడు రైతుల ఖాతాల్లో జమవుతాయని వెల్లడి
- పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభం.. రైతులకు అంకితం

సిద్దిపేట: ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం సుభిక్షంగా ఉండదని తాను బలంగా నమ్ముతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రాన్ని ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనుకంజ వేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రైతుభరోసా కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చిందని తెలిపారు. తొలి విడత పెట్టుబడి సాయం కింద సీఎం నిధులు విడుదల చేశారు. అన్నదాతల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీని

- మిగతా 2వ పేజీలో

## ప్రజల చుట్టూ తిరిగే బడ్జెట్ ఇది..


- ప్రతి కుటుంబానికి భద్రతే లక్ష్యం: భట్టి విక్రమార్క
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేగం.. నిధుల విడుదలలో జాప్యం లేదు
- ఆరోగ్యం, విద్య రంగాల్లో భారీ ప్రణాళికలు
- రైతులకు బోనస్.. వ్యవసాయానికి ప్రత్యేక ప్రోత్సాహం



2లో

## హైదరాబాద్ ను మించేలా అమరావతిని నిర్మిస్తాం

- హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం: సీఎం చంద్రబాబు
- విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు ఏపీ ప్రయాణం
- కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు
- స్మార్ట్ టెక్నాలజీతో ప్రపంచ స్థాయి రాజధాని లక్ష్యం



## జనసేన ఎమ్మెల్యే బాలరాజుకు సైబర్ షాక్ ..

### ఫేక్ లింక్‌తో బ్యాంక్ ఖాతా నుంచి భారీగా నగదు మాయం



సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాకుండా ప్రజాప్రతినిధులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని నేరగాళ్లు ఆయన బ్యాంకు ఖాతా నుంచి భారీ మొత్తంలో నగదును కాజేశారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- మిగతా 2వ పేజీలో

## తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయికి చికెన్ ధరలు!

- స్కిన్‌లెస్ కోడిమాంసం కిలో రూ.400
- పెద్ద బ్రాయిలర్ కూడా రూ.300పైనే
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు
- రంజాన్, ఫంక్షన్ల వల్ల పెరిగిన డిమాండ్
- పౌల్ట్రీలో ఒక్కసారిగా తగ్గిన ఉత్పత్తి



2లో

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుకు సైబర్ షాక్ ..

(మొదటి పేజీ తరువాయి)

సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాకుండా ప్రజాప్రతినిధులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని నేరగాళ్లు ఆయన బ్యాంకు ఖాతా నుంచి భారీ మొత్తంలో నగదును కాజేశారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే బాలరాజు మొబైల్‌కు ఆర్టీఏ (ఆర్టీఏ) చలానా చెల్లించాలంటూ ఓ మేసేజ్ రావడంతో అందులో ఉన్న లింక్‌ను ఆయన నిజమైనదని భావించి క్లిక్ చేశారు. ఆ లింక్ ద్వారా ఆయన ఫోన్‌లో ఓ మాల్వేర్ యాప్ ఇన్‌స్టాల్ అయినట్లు తెలుస్తోంది. అది క్లిక్ చేసిన కొద్దిసేపటికే, జంగారెడ్డిగూడెంలోని ఇండస్ఇండ్ బ్యాంకులో ఉన్న ఆయన ఖాతా నుంచి సుమారు రూ. 12 లక్షలు విత్‌డ్రా అయినట్లు గుర్తించారు. తన ఫోన్ హ్యాక్ అయిందని, ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో షాక్‌కు గురైన ఎమ్మెల్యే బాలరాజు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సైబర్ నేరగాళ్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఐపీ అడ్రస్ ట్రాకింగ్ వంటి సాంకేతిక పద్ధతుల ద్వారా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజల చుట్టూ తిరిగే బడ్జెట్ ఇది..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం సంఖ్యల చుట్టూ తిరిగే అంకెల గారడీ కాదని, ప్రతి సామాన్యుడి చుట్టూ తిరిగే మానవీయ కోణం ఉన్న ప్రణాళిక అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, గతంలో అనేక కుటుంబాలు యజమానిని కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉండటాన్ని తాము గమనించామని, అందుకే రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేలా భారీ ఎత్తున జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. ఎదిగే వయసున్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నామని భట్టి వివరించారు. లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని, నిధుల విడుదల విషయంలో ఎలాంటి జాప్యం ఉండదని, అవసరమైతే వారానికి ఒకసారి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లాకు మరో 'తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్'ను కేటాయిస్తున్నామని, విద్యార్థులు ఎంతవరకు చదువుకోవాలనుకుంటే అంతవరకు చదివించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని స్పష్టం చేశారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారికి నెలకు రూ. 2,000 స్కాలర్‌షిప్ అందిస్తున్నామన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెబుతూ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, పేదలు కూడా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి క్యాష్‌లెస్ హెల్త్ కార్డులను మంజూరు చేస్తున్నామని, ఇది వారిని నమ్ముకున్న కుటుంబ సభ్యులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు ఇప్పటికే రూ. 25 వేల దాకా బోనస్ అందించామని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఆగ్రో మెడిసిన్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాలు పొందిన రైతులకు బోర్ బావుల ఏర్పాటుతో పాటు సోలార్ ప్యానెల్స్ వేయించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయికి చికెన్ ధరలు!

(మొదటి పేజీ తరువాయి)

నాన్‌వెజ్ ప్రియులకు భారీ షాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కిలో చికెన్ ధర ఏకంగా రూ.400 (స్కిన్‌లెస్)కు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో బోన్‌లెస్ రూ.400కి పైగా విక్రయిస్తున్నారు. విజయవాడలో ఈరోజు కేజీ రూ.400గా నమోదయింది. గత వారం కిలో చికెన్ రూ.300గా ఉండగా.. ఇప్పుడు 400కు చేరింది. ఒక్కసారిగా రూ.100 పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. చికెన్ ధర ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేజీ చికెన్ ధర సాధారణంగా రూ.170 నుంచి రూ.220 మధ్య ఉంటుంది. శ్రావణ మాసం, కార్తీక మాసంలో అయితే ఇంకా తక్కువగా ఉంటుంది. కానీ గత 2 నెలల నుంచి ధరల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఫిబ్రవరి మధ్య నుంచి భారీగా పెరుగుతోంది. ఎండల తీవ్రత కారణంగా కోళ్లు చనిపోవడం, రంజాన్ డిమాండ్ కారణంగా చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.400కు చేరడంతో కొనుగోలుదారులు వెనుదిరుగుతున్నారు. 'వామ్మో.. నాలుగొందలు పెట్టి చికెన్ కొనాలా?' అంటూ చాలామంది మార్కెట్ వద్దే వెనక్కి వెళ్లిపోతున్నారు.

## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

హైదరాబాద్: కాళేశ్వరం పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష కోట్లు దోచుకుందని.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పేరుతో దోపిడీకి తెగబడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. దీనివల్ల చివరకు తెలంగాణ మూసేసే పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు. మూసీ పునరుజ్జీవంపై ఆదివారం ఓ హోటల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ పెన్షన్లకు, ఉద్యోగుల జీతాలకు, రైతు భరోసాకు, ప్రభుత్వాన్ని నడిపేందుకు పైసల్లేవంటూ నిత్యం మాట్లాడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మూసీ ప్రక్షాళనకు మాత్రం రూ. లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. అప్పు చేసి సొమ్ము తీసుకొచ్చి, ఆ అప్పు భారాన్ని సామాన్యులపై వేస్తే బీజేపీ ఊరుకోదని హెచ్చరించారు. 55 కి.మీ. మూసీ సుందరీకరణకు ముందుగా రూ. 5 వేల కోట్లు వ్యయం అవుతుందని చెప్పి తీరా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) ప్రజెంటేషన్ రోజున రూ. 7 వేల కోట్లు అవుతుందని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని వృథా చేసే పనులను బీజేపీ అడ్డుకుంటుందని రాంచందర్‌రావు చెప్పారు. డీపీఆర్ ప్రకటన రోజున 10 వేల ఇళ్లు స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందని సీఎం వివరించారని.. కానీ అసెంబ్లీలో మాత్రం కేవలం 1,400 ఇళ్లను కూల్చాల్సి వస్తుందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమంలో వెనుకంజ వేయం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రారంభించారు. ఫ్యాక్టరీని రైతులకు అంకితమిచ్చారు. అలాగే రూ 475.72 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రైతు మహోత్సవాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

**పంట మార్పిడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..**

'రాష్ట్రంలో 2.58 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. అయితే రైతుల ఆదాయం పెరగాలంటే వరి పండించడం ఒక్కటే పరిష్కారం కాదు. ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెరగాలి. బంగారు తెలంగాణ అంటే ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమే. రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి. పంట మార్పిడితోనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. అందుకు అనుగుణంగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. తృణధాన్యాలు (మిల్లెట్స్), ఆకు కూరలు, పామాయిల్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి. రైతులకు మంచి ధర వచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. నాకు వ్యవసాయం చేయడం తెలుసు. చీడపీడలకు ఏ మందు వేయాలో కూడా తెలుసు..' అని సీఎం చెప్పారు. 'నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకుని 12,728 గ్రామాల్లోని రైతులంతా ముందుకెళ్లాలి. ప్రభుత్వం కూడా పంటలను ఎగుమతి చేసే దిశగా కృషి చేస్తోంది. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేశాం. గతంలో 114 నెలల్లో కేసీఆర్ సగటున ఒక్కో నెలకు రూ2,535 కోట్లు ఖర్చు చేస్తే 28 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున నెలకు రూ 5,,500 కోట్లను రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేసింది. తాజాగా రైతు భరోసా తొలి విడత విడుదల చేశాం. 20 రోజుల తర్వాత రెండో విడతలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లు విడుదల చేస్తాం. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల రాబోయే రోజుల్లో మనకు యూరియా కొరత వచ్చేలా ఉంది. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా, ప్రధాని మోదీని కలిసి మన రాష్ట్రానికి ఎక్కువ యూరియా తెచ్చుకునేందుకు బీజేపీ ఎంపీలు సహకరించాలి.


**సిద్దిపేటలో కాంగ్రెస్ గెలిస్తే మంత్రి పదవి**

వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తాం. 1984 నుంచి 2029 వరకు ఒకే కుటుంబానికి చెందిన వారినే ఎమ్మెల్యేను చేశారు. మార్చి చూడండి మంచి జరుగుతుంది. పార్టీ అభ్యర్థిని గెలిపించే బాధ్యతను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లకు అప్పగిస్తున్నా..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రత్యర్థి పార్టీ నియోజకవర్గమనే వివక్ష ఉండదు..**

'ప్రజలకు ఇచ్చే నిధుల విషయంలో వివక్ష చూపను. ప్రత్యర్థి పార్టీ నేతల గురించి ఆలోచిస్తే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. గత పాలకులు ఈ విధంగా విపక్ష నేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. కానీ నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ, ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్దిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చా. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో రాజకీయాంగా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఆ నియోజకవర్గాల ప్రజల అభివృద్ధి కోసం కూడా పని చేస్తాం. వివక్ష చూపే వ్యక్తినయితే.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కే తీసుకెళ్లేవాడిని. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ కూడా పాల్గొని తన నియోజక వర్గం పరిధిలో ఉన్న సమస్యలను నా దృష్టికి తెచ్చారు..' అని రేవంత్ చెప్పారు. 'ప్రైవేట్ పాఠశాలల మోజులకు పోకండి.. ఆర్థికంగా నష్టపోకండి.. ప్రైవేట్ పాఠశాల కంటే నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందిస్తున్నాం.


## హైదరాబాద్ ను మించేలా అమరావతిని నిర్మిస్తాం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యున్నత సాంకేతికతతో, హైదరాబాద్ నగరాన్ని మించేలా ఒక స్మార్ట్ సిటీగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ఐదేళ్ల పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని, కానీ ఇప్పుడు సరికొత్త టెక్నాలజీతో దానిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని, వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో జరిగిన నష్టం కంటే, గత ఐదేళ్లలో జరిగిన నష్టమే అత్యంత దారుణంగా ఉందని, దీనివల్ల ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని ఆయన పేర్కొన్నారు. ప్రజల మనోధైర్యం దెబ్బతిన్న అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో.. 2024 ఎన్నికల్లో ప్రజలు 94 శాతం సీట్ల విజయంతో కూటమికి చారిత్రక తీర్పునిచ్చారని గుర్తుచేశారు. తెలుగుదేశం, జనసేన , బిజెపి కలిసి ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో అద్భుతంగా పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయినప్పటికీ, మళ్లీ అధికారంలోకి రావడానికి పదేళ్లు పట్టిందని, 2014-2019 మధ్య కాలంలో తాము ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో కుంటుపడిన అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తున్నామని, ప్రస్తుతం ఏపీని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు సంక్షేమం , అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అమరావతిని నిర్మించడం ద్వారా ఏపీ భవిష్యత్తును మారుస్తామని చంద్రబాబు నాయుడు ఈ సదస్సులో పునరుద్ఘాటించారు.

## ప్రధాని మోడీ హిస్టరీ క్రియేట్

(మొదటి పేజీ తరువాయి)



అధినేతగా 8,931 రోజులు ప్రజా పదవిలో పూర్తి చేసుకున్నారు. మోడీ తన పదవీకాలంలో 8,931వ రోజును పూర్తి చేసుకుని, రికార్డు సృష్టించారు. ఇందులో గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలం కూడా కలిసింది. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రజా సేవ, నాయకత్వానికి నిదర్శనమైన ఇది ఒక అరుదైన, అసాధారణమైన ఘనత.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి.
ముఖ్యమంత్రిగా అత్యంత సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రధానమంత్రి.
స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన తొలి ప్రధానమంత్రి.
వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల (2014, 2019, 2024) విజేత.

హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, "సేవ, కృషి అచంచలమైన అంకితభావంతో సాధించిన ఒక మైలురాయి. సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ నెలకొల్పిన 8,930 రోజుల రికార్డును అధిగమించి, భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రభుత్వ అధినేతగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రికార్డు సృష్టించారు." అని అన్నారు. "ప్రధాని మోడీ 8,931 రోజుల ప్రజా జీవితం మొదట గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రధానమంత్రిగా 'దేశమే ప్రథమం' అనే పాలన పట్ల ఆయనకున్న ప్రగాఢ అంకితభావాన్ని, చేతల్లో నిజాయితీని, ప్రతి పౌరునికి నిస్వార్థ సేవను ప్రతిబింబిస్తుంది. అపూర్వమైన విశ్వాసం, అసమానమైన సేవపై నిర్మించబడిన ఒక విశిష్ట వారసత్వం. అని అమిత్ షా కొనియాడారు. అమిత్ షా ఇలా అన్నారు, "మోడీజీ దశాబ్దాల సేవ ఒక ప్రత్యేక శకాన్ని సృష్టించింది. పేదలకు హక్కులు కల్పించడం, అభివృద్ధిలో కొత్త రికార్డులు నెలకొల్పడం లేదా ప్రపంచ వేదికలపై దేశ గౌరవాన్ని పెంచడం వంటి విషయాలలో మోడీ శకం భారతదేశాన్ని పూర్తిగా మార్చేసింది."

## అరాద్, డిమోనా నగరాలపై ఇరాన్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో అత్యాధునిక ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ఘోరంగా విఫలం కావడం గమనార్హం. ఇరాన్ దాడిలో ఎవరూ మరణించకపోవడం నిజంగా అద్భుతమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. అరాద్‌లో ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ యుద్ధంలో అనుకున్న లక్ష్యం కచ్చితంగా సాధిస్తామని తేల్చిచెప్పారు. అంతర్జాతీయ సమాజం తమకు సహకరించాలని కోరారు. తద్వారా యుద్ధం మరింత తీవ్రతరం కావడం తథ్యమని సంకేతాలిచ్చారు. ఇరాన్ బాలిస్టిక్ మిస్సైళ్లు తమ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని ఎలా రాగలిగాయన్న దానిపై ఇజ్రాయెల్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉత్తర ఇజ్రాయెల్‌లో వైమానిక దాడిలో ఒకరు మృతిచెందారు. ఈ దాడికి పాల్పడింది తామేనని లెబనాన్ హెజ్‌బొల్లా మిలిటెంట్లు ప్రకటించారు. ఆదివారం ఉదయం ఇజ్రాయెల్‌లో సైరన్ల మోతలు వినిపించాయి. సౌదీ అరేబియా, యూఏఈ సహా ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఇరాన్ ఆయుధాలను మధ్యలోనే కూల్చివేశామని ఆయా దేశాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని అండిమెష్క్ సిటీ ఆసుపత్రిపై భారీ దాడి జరిగింది. రోగులు, వైద్యులను మరో నగరానికి తరలించారు. ఈ దాడికి ఇజ్రాయెల్ కారణమని భావిస్తున్నారు. హెజ్‌బోల్లా మిలిటెంట్లు తమ ఆయుధాలను ఇజ్రాయెల్ సరిహద్దుకు తరలిస్తున్నారు.



లెబనాన్‌లోని ఖస్మియే వంతెనను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఉత్తర సరిహద్దుకు సమీపంలోని లెబనాన్ నివాసాలను ధ్వసం చేయాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తమ సైన్యాన్ని ఆదేశించారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌కు ఇప్పటికే వెయ్యి మందికిపైగా మృతిచెందారు. 10 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. హెజ్‌బోల్లా గ్రూప్ వందలాది రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లో కీలక నగరం టెల్ అవీవ్‌పై ఇరాన్ ఆదివారం బాలిస్టిక్ క్షిపణితో దాడికి దిగింది. ఈ దాడిలో పలువురు గాయపడినట్లు తెలిసింది. హోర్ముజ్ నుంచి రాకపోకలు సాగించేందుకు కొన్ని దేశాల నౌకలకు తాజాగా అనుమతి లభించింది. ఇందులో భారత్, జపాన్, చైనా, పాకిస్తాన్, తుర్కియే చమురు నౌకలు ఉన్నాయి.

**ప్రపంచానికి పెనుముప్పు ఇరాన్: నెతన్యాహు**

ఇరాన్ వద్ద అత్యంత ప్రమాదకరమైన మారణాయుధాలు ఉన్నాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆదివారం ఆరోపించారు. డీగో గార్సియా దీవిపై జరిగిన దాడిని ప్రస్తావించారు. సుదూరంలో ఉన్న యూరప్ దేశాలపైనా దాడి చేసే సామర్థ్యం ఇరాన్‌కు ఉన్నట్లు దీన్నిబట్టి తెలుస్తోందని అన్నారు. ప్రపంచానికి ఇరాన్ పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలందరి బాగు కోసమే అమెరికాతో కలిసి తాము పోరాడుతున్నామని తేల్చిచెప్పారు. శనివారం రాత్రి రెండు పట్టణాలపై దాడులకు దిగడం అత్యంత దారుణమని మండిపడ్డారు. సాధారణ జనావాసాలను ఇరాన్ టార్గెట్ చేసిందన్నారు. ప్రజలను హత్య చేయాలన్నదే ఇరాన్ అసలు ఉద్దేశమని విమర్శించారు. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో ఎవరూ చనిపోలేదని వ్యాఖ్యానించారు.

**హోర్ముజ్‌ను తెరవకుంటే వినాశనమే: ట్రంప్**

హోర్ముజ్ నుంచి నౌకల రాకపోలకు అడ్డంకులు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవాలని తేల్చిచెప్పారు. తమ మాట వినకపోతే ఇరాన్‌కు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలను, ఇతర సదుపాయాలను సర్వనాశనం చేస్తామని తేల్చిచెప్పారు. ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ గలిబాఫ్ తీవ్రంగా స్పందించారు.

# కిక్కిరిసిన యాదగిరిగుట్ట.. దర్శనానికి పడిగాపులు!

- క్యూలైన్లు, గర్భాలయం భక్తులతో కిక్కిరిసిన దృశ్యం
- ధర్మ దర్శనానికి 5 గంటలపాటు నిరీక్షణ
- వృద్ధులు, చిన్నారులకు క్యూలైన్లలో ఇబ్బందులు
- వసతి గదులు నిండిపోవడంతో చెట్ల కిందనే విశ్రాంతి
- పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల రద్దీ
- ప్రసాదాల కౌంటర్ల వద్ద భారీ రద్దీ





**యాదగిరిగుట్ట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ ఆరాధ్య దైవం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శనివారం రంజాన్ పండుగ, ఆదివారం వరుస సెలవులు రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా భక్తుల కోలాహలం నెలకొంది. పవిత్ర విష్ణు పుష్కరిణి, కల్యాణకట్ట, క్యూలైన్లు, గర్భాలయ ప్రాంగణం, శీఘ్ర దర్శనం మార్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. "ఓం నమో నారసింహాయ" నామస్మరణతో యాదాద్రి గిరులు మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు. ముందుగా విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ కారణంగా స్వామివారి ధర్మ దర్శనానికి దాదాపు 5 గంటల సమయం పట్టింది. ఈ ఒక్కరోజే సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

**భక్తుల ఇక్కట్లు:**

భక్తుల రద్దీ పెరగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి నిలబడాల్సి రావడంతో అలసటకు గురయ్యారు. దర్శనానంతరం భక్తులు లడ్డూ, పులిహోర ప్రసాదాల కోసం కూడా రద్దీ నెలకొంది. కొండ కింద పార్కింగ్ ప్రాంతాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. వాహనాలు నిలుపుకోవడానికి స్థలం లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. వసతి గదుల కొరత కారణంగా తులసి కాటేజీతో పాటు ఇతర వసతి గృహాలన్నీ నిండిపోవడంతో, గదులు దొరకని భక్తులు కొండపై షెడ్ల కింద, చెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి ఏర్పడింది.







## అమృతవనంలో.. 'అమృత' స్మృతులు!

- గురువుల సమక్షంలో 2000-2001 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

**రామన్నపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** పాతికేళ్ల నాటి స్మృతులు ఆ ప్రాంగణంలో మళ్ళీ ప్రాణం పోసుకున్నాయి. అల్లరి చిల్లరగా తిరిగిన ఆ బాల్య మిత్రులంతా ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రామన్నపేట మండల కేంద్రంలోని ఏవీఎం ఉన్నత పాఠశాలకు చెందిన 2000-2001 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక అమృతవనంలో అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాల గురువులు ఉయ్యాల రాములు, గోపాల్ రెడ్డి, ఏనుగు లక్ష్మారెడ్డిల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా తమ చిన్ననాటి అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. గురువులు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని, తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు సమాజంలో వివిధ హోదాల్లో స్థిరపడటం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, పాత మిత్రులతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో మేడబోయిన ఉపేందర్, ఆవుల నరేందర్, గాదే సతీష్, గాదే రాము, నోముల చంద్రశేఖర్, నల్ల వెంకట్రెడ్డి, ఆకవరపు ఉదయ్ కుమార్, అప్పం సంతోష్, కోనూరు లింగస్వామి, గుమ్ముల నర్సిరెడ్డి, మహేష్, కవిత, ప్రీతి కవిత, హేమలత, మమత, సత్యశ్రీ, రాపోలు శ్యాంసుందర్, కొండా వెంకటేశం, శివకుమార్, రెవణాల సత్యనారాయణ, మథిన్, ఎస్కే మహబూబ్, జానీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పదవుల పర్వం.. నేతలకు ఘన అభినందనలు



**రామన్నపేట/భువనగిరి, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి-భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా ఎంపికైన తిమ్మాపురం మహేందర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన గుండాల నరసింహలను భువనగిరిలోని వివేర హోటల్‌లో కలిసి పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ జెడ్పీటిసి పున్న జగన్మోహన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర తదితరులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను అభినందించారు. పార్టీ అభివృద్ధి, బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస బాలకిషన్, జినుకల ప్రభాకర్, మాజీ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి, శంబాల వెంకన్న, కే.భాస్కర్ రెడ్డి, తాళ్లపల్లి సత్తిరెడ్డి, పోలు వెంకట్ రెడ్డి, ఎడ్ల సురేందర్ రెడ్డి, కర్రె రమేష్, పి.నరసింహ, బి.నరసింహ, గట్టు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు రవి కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

- 50 కేజీల బియ్యం, అవసరమైన సరుకుల అందజేత
- పిల్లల చదువులకు ఆర్థిక సాయం చేస్తానని నరసింహా గౌడ్ హామీ

**రామన్నపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన ఏలూరి రవి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ నాయకుడు బులచ్చి నరసింహా గౌడ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మానవత్వం చాటుకుంటూ ఆయన కుటుంబానికి తక్షణ సాయంగా 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం నరసింహా గౌడ్ మాట్లాడుతూ.. రవి మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రవి పిల్లల చదువుల కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని భవిష్యత్తులో అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య, పుట్టల మహేష్, మేడి సంతోష్, గట్టు బాలు తదితరులు పాల్గొని రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.



## గిన్నిస్ రికార్డులో 'రాజాపేట' మహిళల భాగస్వామ్యం



- వాసవి మాత సామూహిక పారాయణంలో ఆర్యవైశ్య మహిళల భక్తితత్పరత



**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఆదివారం నిర్వహించిన శ్రీ వాసవి మాత సామూహిక పారాయణ మహోత్సవంలో రాజపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రికార్డు స్థాయిలో వేలాది మంది మహిళలు ఒకే చోట చేరి భక్తిశ్రద్ధలతో పారాయణం చేయడం విశేషం. ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం పట్ల రాజపేట మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా సాగిన ఈ బృహత్తర కార్యక్రమంలో తాము కూడా భాగస్వామ్యం కావడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజపేట నుంచి బుడమ పద్మ, నాళ్ల పద్మ, ఇమ్మడి శ్రీదేవి, నంగునూరి రితిక, నంగునూరు ప్రణవి, బెజుగం స్వప్న, ఇమ్మడి రమ, పెద్ది సంతోషిని, బెజుగం రాజేశ్వరి, ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## అనుబంధాల 'లోక'మది.. సమిష్టిగా వనభోజనాలు!

- రఘునాథపురంలో ఆదర్శంగా నిలిచిన ఉమ్మడి కుటుంబం



**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** నేటి ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న వేళ, రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన లోక వెంకటయ్య - అనసూయ పుణ్య దంపతుల కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తెలుగు నూతన సంవత్సరమైన పరాభవ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, ఈ కుటుంబ సభ్యులందరూ కలిసి ఆదివారం సామూహిక వనభోజనాలకు వెళ్లారు. వెంకటయ్య దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. వారి సంతానంతో కలిపి మొత్తం 60 మందికి పైగా సభ్యులు ఒకే చోట చేరి సందడి చేశారు. వనభోజనాల వద్ద కుటుంబ సభ్యులే స్వయంగా వంటవార్పు చేసుకుని, సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, చిన్న పెద్ద తేడా లేకుండా ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. లోక కృష్ణమూర్తి-రాజ్యలక్ష్మి, నరసింహులు-పద్మ, రాములు-సుభద్ర, మల్లేశం-మీనా రాణి, విట్టల్-ఉపేంద్ర దంపతులతో పాటు కుమార్తెలు లక్ష్మి, పద్మ వారి అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్లతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఈ కుటుంబం చూపిస్తున్న ఐకమత్యాన్ని చూసి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందనలు కురిపించారు.



## జై భీమ్ ఆదర్శ యూత్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా పట్నం గణేష్ ఏకగ్రీవం

**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండల పరిధిలోని పాముకుంట గ్రామంలో 'జై భీమ్ ఆదర్శ యూత్' నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని యువతను ఏకం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా పట్నం గణేష్, జనరల్ సెక్రటరీలుగా రఘుపతి, మోజేష్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా బి. కర్ణాకర్, డి. బాబు, జాయింట్ సెక్రటరీలుగా జీ. దానిల్, ఆర్. దినాకర్, కోశాధికారిగా బి. శేఖర్, ఉపకోశాధికారిగా ఆర్. ఏసు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీ. సన్నీలు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

**బండ్లగూడ (తొలివెలుగు న్యూస్):** ఉద్యోగం (జీశీఎ) రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపానికి గురైన యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య ( ాబఱఱషఱఱసవ ) కు పాల్పడ్డాడు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనపర్తికి చెందిన సిద్ధార్థ (27) అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి కార్ సెక్షన్ కాలనీలో నివాసం అంటూ చిరు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా ఉద్యోగం లేకపోవడంతో ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాకపోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్ధార్థ ఎప్పుడూ ఉద్యోగం గురించే ఆలోచించేవాడని మృతుడి సోదరుడు తెలిపారు.



# ఘనంగా హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- ఏప్రిల్ 2న రాజపేటలో విజయోత్సవ యాత్ర
- భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలి: సర్పంచ్ కోయ మధు

**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రమైన రాజపేటలో ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజపేట సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ.. భక్తులందరూ ఐకమత్యంతో ఈ శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా, క్రమశిక్షణతో యాత్ర సాగాలని ఆకాంక్షించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు భోగ జ్ఞానేందర్, బజరంగ్ దళ్ మండల సంయోజక్ సట్టు రవీందర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న జరిగే శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దాచపల్లి రాజు, సట్టు తిరుమలేష్, మేకల రమేష్, ఎర్రగోకుల జశ్వంత్, గుర్రం నర్సింహులు, ఆడెపు గణేష్, మార్క శివ, బీరప్ప, వేణు, సంజీవరెడ్డి, నవీన్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కార్యదర్శిగా 'ఇంజ నరేష్' నియామకం

- నియామక పత్రం అందజేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- అభినందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా రాజపేట మండలానికి చెందిన ఇంజ నరేష్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నరేష్ నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయనతో పార్టీ పట్ల విధేయతతో పనిచేస్తానని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొని నరేష్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా నరేష్ పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన బీర్ల ఐలయ్యకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ధనుంజయ్‌కు 'గద్దర్ అవార్డు'.. ఘనంగా సన్మానం

- కొండా లక్ష్మణ్ బాపూజీ డాక్యుమెంటరీకి గుర్తింపు
- సీతారామచంద్రస్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సత్కారం



**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ నిర్మించిన చౌటుప్పల్ పట్టణ ప్రముఖుడు, వ్యాపారి చిరందాసు ధనుంజయ్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. ఆయన నిర్మించిన ఈ డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు' దక్కడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ధనుంజయ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి మాట్లాడుతూ.. తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలను, ఆయన జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేయాలనే సంకల్పంతో ధనుంజయ్ ఈ డాక్యుమెంటరీని నిర్మించడం అభినందనీయమన్నారు. ఆయన కృషిని ప్రభుత్వం గుర్తించి గద్దర్ పేరిట అవార్డు ఇవ్వడం చౌటుప్పల్ ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత ధనుంజయ్ మాట్లాడుతూ.. బాపూజీ జీవిత చరిత్రను డాక్యుమెంటరీగా మలిచే అవకాశం రావడం తన అదృష్టమని, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం, తూర్పాటి నరసింహ, వర్కాల వెన్నెల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధం



**నేరడిగొండ మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మండలంలోని గ్రామాల్లో తర్ణం (కే) గ్రామంలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గూడా రాజేందర్ రెడ్డి అనే రైతుకు చెందిన పశువుల పాక అగ్నికి ఆహుతైంది. బాధితుడు రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం సుమారు 7:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఉదయం నిద్రలేచి చూసేసరికి పశువుల పాక మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ కావడమే ఈ ప్రమాదానికి కారణమని బాధితుడు భావిస్తున్నాడు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.ఈ ప్రమాదంలో పాకలోని గడ్డి వాముతో పాటు, 30 స్ప్రింక్లర్ పైపులు ఇతర సామగ్రి కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అదుపు చేసే లోపే తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు. మండల రెవెన్యూ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని నష్టాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదికను సమర్పిస్తున్నట్టు తెలిపారు.

# నీళ్లకై 'కన్నీటి' దార.. నిలువునా ఎండుతున్న పైరు!

- రోజుకు రూ.1500 ఖర్చు.. అప్పుల ఊబిలో కౌలు రైతు
- బోరు ఎండి పాయె.. పైరు వాడి పాయె..
- బీర్ల ఐలయ్య సొంత నిధుల హామీ ఏమాయె?
- బొందుగులలో పర్యటించిన సీపీఐ నేతలు



**రాజపేట, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** చేతికొచ్చే దశలో ఉన్న పంట సాగునీరు లేక కళ్ల ముందే ఎండుతుంటే చూసి ఆ రైతన్న కన్నీరుమున్నీరవుతున్నాడు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అప్పులు చేసి మరీ ట్యాంకర్లతో నీళ్లు తోలి పంటను బతికించుకునేందుకు ఆరాటపడుతున్నాడు. రాజపేట మండలంలో నెలకొన్న ఈ దయనీయ పరిస్థితిపై సీపీఐ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని బొందుగుల గ్రామంలో ఎండిపోతున్న వరి పొలాలను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. బొందుగుల గ్రామానికి చెందిన కౌలు రైతు మర్ల నాగరాజు పరిస్థితి అత్యంత హృదయవిదారకంగా ఉందన్నారు. మర్ల నాగరాజు.. కాలే లక్ష్మీ అనే మహిళ వద్ద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం ఇప్పటికే రూ. లక్ష వరకు అప్పు చేశాడు. తీరా పంట చేతికొచ్చే సమయానికి బోరుబావి పూర్తిగా ఎండిపోయింది. కళ్ల ముందే పైరు ఎండిపోతుండటాన్ని చూడలేక, దిక్కుతోచని స్థితిలో గత పది రోజుల నుంచి ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీళ్లు కొనుగోలు చేసి పొలానికి పారిస్తున్నాడు. ఇందుకోసం రోజుకు రూ. 1500 చొప్పున అదనంగా ఖర్చు చేస్తున్నాడు. ఇంకా నెల రోజుల పాటు పొలానికి నీళ్లు పారాల్సిన అవసరం ఉండటంతో, ఆ భారాన్ని మోయలేక ఆ రైతు నెత్తి చేతులు పెట్టుకుని కుమిలిపోతున్నాడని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**చెరువులు నింపాలి.. పరిహారం ఇవ్వాలి:**

వెంటనే ప్రభుత్వం స్పందించి సింగారం రెడ్డి చెరువును నింపి, అక్కడి నుంచి కాలువల ద్వారా అన్ని గ్రామాల చెరువులకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎన్నికల ముందు స్థానిక నాయకుడు బీర్ల ఐలయ్య ఇచ్చిన హామీని ఈ సందర్భంగా సీపీఐ నేతలు గుర్తుచేశారు. సొంత నిధులతో 8 కిలోమీటర్ల మేర కాలువ తవ్వించి రాజపేట మండలంలోని చెరువులన్నీ నింపుతామని ఆయన చెప్పి రెండేళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆ ఊసే ఎత్తకపోవడం విచారకరమన్నారు. నష్టపోయిన రైతాంగానికి తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మూల పోచయ్య, బొందుగుల నేతలు గొల్లూరు రాములు, గ్రామ శాఖ కార్యదర్శి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సేవా కార్యక్రమాలతోనే రామచంద్రంకు నిజమైన నివాళి

- మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభం
- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద తాటి రామచంద్రం జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తాటి రామచంద్రం సేవా సమితి నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి రామచంద్రం కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. వారి ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ జిల్లా చైర్మన్ పాశం సంజయ్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, పాక చిరంజీవి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి, సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి చెరుకు లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, నాయకులు గోశిక రవి, గుర్రం వెంకటేశం, గోశిక ప్రభాకర్, బొబ్బిళ్ళ రాజేందర్, రఫీ, బొంగు రమేష్ పాల్గొన్నారు.






# మునుగోడు అభివృద్ధి ప్రధాత కూసుకుంట్ల

- అభివృద్ధి చేసిన నాయకుడిపై విమర్శలు తగవు: మందుల సత్యం
- శిలాఫలకాల ధ్వంసం కాంగ్రెస్ దారిద్ర్యానికి నిదర్శనం
- మునుగోడులో బీఆర్ఎస్ నాయకుల ధ్వజం


**మునుగోడు, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అని, ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం అన్నారు. ఆదివారం మునుగోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంజనేయ స్వామి గుడి లేని ఊరు లేదని, అలాగే కూసుకుంట్ల అభివృద్ధి చేయని గ్రామం నియోజకవర్గంలో లేదని స్పష్టం చేశారు. చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీలు కావడం, చండూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, డిండి, శివన్నగూడెం ప్రాజెక్టుల ప్రారంభం అంతా ప్రభాకర్ రెడ్డి కృషి ఫలితమేనన్నారు. పేదల కోసం 100 పడకల ఆసుపత్రిని తీసుకువచ్చిన ఘనత ఆయనదేనని, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డికి కాంట్రాక్టులు, కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని విమర్శించారు. ఎన్నికల వేళ ఉకోండి, అంతంపేట గ్రామాలకు ఇచ్చిన హామీలను రాజగోపాల్ రెడ్డి గాలికి వదిలేశారని ఆరోపించారు. ఒక ఊసరవెల్లి కూడా సిగ్గుపడేలా ఆయన రంగులు మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని, రాజగోపాల్ రెడ్డి లేదా ఆయన అనుచరులు వస్తారా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పగ్గిళ్ల సతీష్, నాయకులు మధనబోయిన పరమేష్ యాదవ్, పోలగొని సైదులు, నల్గొండ అంజి, జెంగిలి సాంబయ్య, భూపతి రెడ్డి, ఈద శరత్ బాబు, ఐతగోని శేఖర్, దోటి కరుణాకర్, బండారు శ్రీనివాస్, యాడవెల్లి సురేష్, గోలి ప్రవీణ్, ఓరంగటి శంకర్, గాలి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక వికాసం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల



- భువనగిరిలో ముగిసిన 'పీఎం సంసద్ ఖేల్ మహోత్సవం'
- విజేతలకు బహుమతుల ప్రధానం..
- త్వరలోనే తెలుగు నేర్చుకుంటా..

**యాదాద్రి భువనగిరి, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా యువతలో క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్‌ను పెంపొందిస్తాయని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. భువనగిరి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన 'పీఎం సంసద్ ఖేల్ మహోత్సవం' ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడుతూ.. "తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నేను పాల్గొంటున్న మొదటి బహిరంగ కార్యక్రమం ఇదే కావడం సంతోషంగా ఉంది. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం. క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయి. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఖేల్ మహోత్సవం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మంచి వేదిక లభిస్తోంది. ఫిట్ ఇండియా నినాదంతో శరీరం, ఆత్మ శుద్ధి చెందుతాయి" అని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో 1,520 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు.



వచ్చే పర్యటన నాటికి తెలుగు నేర్చుకుని, మీతో తెలుగులోనే మాట్లాడతానని ఆయన చెప్పడంతో సభికులు హర్షధ్వానాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ



రాష్ట్ర నాయకులు బూర నర్సయ్య గౌడ్, గూడూరు నారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్, అధ్యక్షులు రత్నపురం బలరాం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణ లగ్న పత్రిక లేఖనం

- లింగోజిగూడెంలో ఆధ్యాత్మిక శోభ
- శ్రీరామనవమి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు లింగోజిగూడెం గ్రామంలో శ్రీరామనవమి వేడుకల సందడి ప్రారంభమైంది. గ్రామంలోని శ్రీ శివమహదేవ ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించి పండితులు శాస్త్రోక్తంగా లగ్న పత్రికను లేఖనం చేశారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ బండమీది ఎల్లయ్య, ధర్మకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి స్థానిక వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలను ఈసారి మరింత వైభవంగా జరిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పర్నె శివారెడ్డి, మాజీ కౌన్సిలర్ బండమీది మల్లేష్, మాజీ సర్పంచ్ ఊదరి నరసింహ, నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి బండమీది వెంకటేష్, మాజీ అధ్యక్షులు ఎర్రగోని లింగస్వామి యాదవ్, బాతరాజు అంజయ్య, బండారి ప్రవీణ్, ఎర్రగోని కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం: నిరంజన్ గౌడ్

- రివర్స్ గేర్‌లో రాష్ట్ర పాలన
- బీసీలకు నిధుల కేటాయింపులో కోత
- చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ నాయకుల విమర్శలు




**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను వంచించేలా ఉందని చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, దండు మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం చౌటుప్పల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్లిన రాష్ట్రం, కాంగ్రెస్ పాలనలో రివర్స్ గేర్‌లో వెళ్తోందని ఎద్దేవా చేశారు. ప్రతి ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, మూడు బడ్జెట్‌లు కలిపినా అందులో సగం కూడా కేటాయించలేదని విమర్శించారు. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టడమే కాకుండా, రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ. 2.80 లక్షల కోట్లు అప్పు చేస్తే, కాంగ్రెస్ రెండున్నర ఏళ్లలోనే రూ. 3.75 లక్షల కోట్లు అప్పు చేసిందని గణాంకాలతో వివరించారు. బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టులు, నిరుద్యోగులు, జర్నలిస్టుల ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు కొత్త పర్వతాలు యాదవ్, రైతుబంధు జిల్లా మాజీ డైరెక్టర్ ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, నాయకులు బాతరాజు యాదగిరి, చిన్నగోని వెంకటేశం, బాతరాజు లింగస్వామి, సోమ శ్రీధర్ రెడ్డి, ఉదిరి రాకేష్, గంగాదేవి శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

**జన్నారం,మార్చి 22(తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం రోజున జన్నారం మండల కేంద్రంలో గల ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి తరగతి గదులు, వంటశాల, భోజనశాల, నిత్యావసర సరుకుల నిల్వలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, హాజరు పట్టికలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు.ఆశ్రమ పాఠశాలలోని చెత్త చెదరాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేయడం జరుగుతుందని, శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు.

# తాగునీరులో మురుగు

**మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మహానగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. జలమండలి పరిధి విస్తరించి మహా జలమండలిగా ఏర్పడిన నీటి సమస్యల్లో ఎలాంటి మార్పులు రాకపోగా.. పరిస్థితి మరింత దిగజారిపోతున్నది. అధికారులు ఎప్పుడూ ఏదో ఒక రూపంలో పనులు చేస్తున్నట్లు కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. ప్రతిరోజు జలమండలి పరిధిలోని ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సమస్య ఏర్పడుతూనే ఉంది. జలమండలికి ఇంత పెద్ద వ్యవస్థ ఉన్నప్పటికీ నీటి సరఫరాలో సమస్యలు నిత్యం ఉత్పన్నం అవుతుండటం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఏదో ఒకచోట తాగునీటిలో మురుగు కలువడం, దుర్వాసన వస్తుండటం నిత్యకృత్యంగా మారుతున్నది. మరోవైపు లోప్రెషర్ వేధిస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సరఫరా అయ్యేదే గంటా రెండు గంటలయితే ఆ సమయంలోనూ లోప్రెషర్‌తో రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు, లీకేజీలకు ఇక కొదవే లేకుండా పోతున్నది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో తాగునీటికి నగర ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురించేలా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం నగరంలో ఎక్కడెక్కడా సమస్యలు తలెత్తుతున్నాయో గుర్తించి వాటిని పరిష్కరించి ఏప్రిల్, మే నెలల్లో నీటి సమస్య రాకుండా చూడాలని సూచిస్తున్నారు.



### మురుగు, దుర్వాసన..

పలుచోట్ల తాగునీరు మురుగుమయంగా ఉండటం, దుర్వాసన వస్తుండటం నిత్య కృత్యంగా మారింది. ప్రజలు ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో నీళ్లు ఉదయం 5.30 గంటల నుంచి 6.30 వరకు మాత్రమే సరఫరా అవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. దాదాపు 10 నిమిషాల పాటు రంగు మారిన నీళ్లు సరఫరా అవుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. పది నిమిషాల తర్వాత నుంచి మంచి నీరు వస్తున్నా గంటలోపే సరఫరా నిలిచిపోతున్నదని ఆరోపిస్తున్నారు. మురుగు నీరు రావడం, దుర్వాసన వస్తున్నదని అధికారులకు ఎన్నిస్లారు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇలా రోజుల తరబడి మురుగు నీటితో పాటు కేవలం గంట మాత్రమే సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగు మారి దుర్వాసన వస్తుండటంతో ఆ నీటిని వాడటం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అదే విధంగా కోకాపేటలో వారంలో రెండు మూడు రోజులకు ఒకసారి రంగు మారిన నీళ్లు వస్తున్నాయి. కొద్ది సేపటి తర్వాత మళ్లీ శుభ్రమైన నీరు వస్తుందని పలు కాలనీల ప్రజలు చెబుతున్నారు.

### లోప్రెషర్ సమస్య..

లోప్రెషర్ సమస్య నగరంలోని చాలా చోట్ల వేధిస్తున్నది. లోప్రెషర్‌కు ప్రధాన కారణం క్షేత్రస్థాయి అధికారులు, లైన్‌మెన్‌లు విధుల్లో అలసత్వం వహించడమే కారణం అని సమాచారం. నగరంలోని చాలా కాలనీల్లో లైన్‌మెన్లు సకాలంలో నీటిని మళ్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని కాలనీలకు రెండు మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పలు కాలనీల్లో అర్ధరాత్రి దాటినాక నీటిని వదులుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నందినగర్‌లో మూడు రోజులకోసారి సరఫరా చేస్తుండటంతో ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నట్లు చెబుతున్నారు. జలమండలి ట్యాంకర్లు సైతం సకాలంలో రాకపోవడం వల్ల ప్రైవేట్‌గా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. బస్తీ బాట పేరిట ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నా జలమండలి తీరు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని వినియోగదారులు మండిపడుతున్నారు. అధికారులు కాలనీల్లోకి వచ్చినప్పుడే హడావుడి చేస్తున్నారు కానీ ఆ తర్వాత క్షేత్రస్థాయి అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎండల తీవ్రత పెరగక ముం దే సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.




## ఎల్లమ్మ దేవాలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- గౌరవ అధ్యక్షుడిగా ఊదరి వెంకటేష్ మహాజన్
- అధ్యక్షుడిగా ఊదరి భూపాల్ నియామకం

**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల దేవాలయ అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసేలా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా ఊదరి వెంకటేష్ మహాజన్, ఎర్ర భుజంగం, బద్రి గాలయ్య, లందగిరి వెంకటేశంలను ఎంపిక చేశారు. అలాగే అధ్యక్షుడిగా ఊదరి భూపాల్, ఉపాధ్యక్షులుగా కడుపు ఉపేందర్, వంగూరి నవీన్, ఎర్ర శ్రవణ్, లందగిరి పవన్ కళ్యాణ్, సుక్క ప్రవీణ్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా బద్రి బాలకృష్ణ, కోశాధికారిగా ఎర్ర శివాజీ, కార్యదర్శులుగా కడుపు శ్రీకాంత్, ఎర్ర శ్రవణ్, లందగిరి కిరణ్, కడుపు నరేష్, ఊదరి అంజయ్యలతో పాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా, 11 మందిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అమ్మవార్ల దేవాలయ అభివృద్ధికి, ఉత్సవాల నిర్వహణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాం

**మంచిర్యాల, మార్చి 22(తొలివెలుగు న్యూస్):** 'ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు' కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి , ఇతర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రైతులకు ముఖ్యమైన 'రైతు భరోసా' నిధులను విడుదల చేశారు. అనంతరం నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి, రిఫైనరీ మరియు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ,రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సరే రైతు సంక్షేమమే పరమావధిగా 21 వేల కోట్ల రుణమాఫీని అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదని తెలిపారు. సన్న వడ్ల సాగుకు 10 వేల కోట్ల మద్దతు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తోందన్నారు. సమస్య ఏదైనా పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం,వ్యవసాయాభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలిపారు. సభను విజయవంతంగా చేసినందుకు రైతులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.





## సర్పంచ్ 'మహాలక్ష్మీ' మురిపెంత.. హామీ నెరవేర్చిన వింత!

- ఆడబిడ్డ పుడితే 'మహాలక్ష్మీ కానుక'.. హామీ నిలబెట్టుకున్న సర్పంచ్
- తుప్రాన్‌పేటలో చిన్నారికి రూ. 10,116 నగదు అందజేత
- మాట తప్పని సర్పంచ్ దంపతులను అభినందించిన గ్రామస్తులు

**చౌటుప్పల్, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ చౌటుప్పల్ మండల పరిధిలోని తుప్రాన్‌పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక - శ్రీశైలం యాదవ్ దంపతులు ఆదర్శంగా నిలిచారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా తమ మేనిఫెస్టోలో ప్రకటించిన 'మహాలక్ష్మీ కానుక' పథకాన్ని అమలు చేస్తూ మాట తప్పని నాయకత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడబిడ్డ పుడితే నగదు ప్రోత్సాహం అందజేస్తామని ఇచ్చిన హామీ మేరకు, తాజాగా వర్కూరి మౌనిక - బాలకృష్ణ దంపతులకు ఆడశిశువు జన్మించడంతో సర్పంచ్ దంపతులు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారిని ఆశీర్వదించి రూ.10,116 నగదును 'మహాలక్ష్మి కానుక'గా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆడబిడ్డలకు గౌరవ స్థానం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్య గ్రామంలో సానుకూల సందేశాన్ని పంపుతోందని, ఆడపిల్లల పట్ల గౌరవ భావన పెంపొందించడంలో దోహదపడుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ దంపతుల ఈ చర్యను గ్రామస్తులు అభినందిస్తూ, ఎన్నికల హామీని నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముద్దం రమేష్ యాదవ్, వార్డు సభ్యులు బొజ్జ స్వామి, బక్కతట్ల శ్రీకాంత్ యాదవ్, మంటిపల్లి మల్లయ్య యాదవ్, వర్కూరి బాలకృష్ణ, పోచమోని అండాలు, గంధం భాగ్యమ్మ అశోక్, భారాస గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి చెంచల భరత్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కతట్ల యాదగిరి యాదవ్, వర్కూరి రాము, వంటల ప్రవీణ్, చిలుకల మల్లేష్, గుండెమోని నాగరాజు యాదవ్, పోచమోని పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి చెరువులో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి శ్రీకారం.


**మంచిర్యాల, మార్చి 22 (తొలివెలుగు న్యూస్):** పట్టణ సౌందర్యాన్ని పెంపొందించేందుకు మందమర్రి మున్సిపాలిటీ కీలక ముందడుగు వేసింది.ఊరు మందమర్రి చెరువు పరిధిలో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు రాష్ట్ర మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. భారత్ అమృత్ పథకం కింద రూ.2.31 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ పాల్గొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా చెరువు పరిసరాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామం, విశ్రాంతి కోసం ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఇంజనీర్లు, స్థానిక నాయకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మెప్మా ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# హీరోలకి పోటీ ఇస్తున్న లేడీ సూపర్ స్టార్..


సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోల పారితోషికాలు, వారి లైఫ్ స్టైల్ గురించి ఎక్కువగా చర్చలు జరుగుతుంటాయి. అయితే ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న లేడీ సూపర్ స్టార్ నయనతార ఆస్తుల వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలు అందుకుంటూ నయనతార తన ప్రత్యేకతను నిరూపించుకుంది. ఆమె నటించిన సినిమాలు వసూళ్ల విషయంలో స్టార్ హీరోల సినిమాలకు సాటిగా నిలుస్తుండటంతో, ఆమె క్రేజ్ రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం సౌత్ ఇండియాలో అత్యంత సంపన్న హీరోయిన్‌గా ఆమె పేరు మారుమోగుతోంది. తాజా సమాచారం ప్రకారం, నయనతార వ్యక్తిగత ఆస్తుల విలువ సుమారు రూ.300 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్కో సినిమాకు రూ.10 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్న ఆమె, తన కెరీర్‌ను అద్భుతంగా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా, వ్యాపారవేత్తగా కూడా తన ప్రతిభను చాటుకుంటోంది. తన సొంత ప్రొడక్షన్ హౌస్ ద్వారా సినిమాలు నిర్మిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్న నయనతార, రియల్ ఎస్టేట్ రంగంలోనూ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టింది. చెన్నై, హైదరాబాద్, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో ఖరీదైన ఇళ్లు, ఆస్తులు ఆమె సొంతమని సమాచారం. ఇవన్నీ ఆమె సంపదను మరింత పెంచుతున్నాయి. ఇంకా విశేషమేమిటంటే, ఆమెకు సుమారు రూ.50 కోట్ల విలువ చేసే ప్రైవేట్ జెట్ విమానం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఇది ఆమె లైఫ్ స్టైల్‌ను మరింత హైలైట్ చేస్తోంది. అయితే ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం ఆమె క్రమశిక్షణ, సినిమాల ఎంపికలో చూపుతున్న జాగ్రత్త, అలాగే తన కెరీర్‌పై ఉన్న స్పష్టమైన దృష్టి అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దానికి పైగా ఇండస్ట్రీలో తన స్టార్డమ్‌ను కొనసాగిస్తూ, గ్లామర్ మరియు పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నయనతార, ఇప్పుడు కేవలం హీరోయిన్‌గా కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగింది. పారితోషికం, ఆస్తులు రెండింటిలోనూ ఈ స్థాయిని సాధించడం అరుదైన విషయం కావడంతో, ఆమె విజయగాథ చాలా మంది ప్రేరణగా నిలుస్తోంది.

## విష్ణు ప్రియ



# ఆదిత్య ధర్ నీకు సెల్యూట్ కంగనా రనౌత్

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ 'కంగనా రనౌత్' వివాదాస్పద విషయాలతో ఘాటైన వ్యాఖ్యలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. పైగా ఆమె సోషల్ మీడియాలో ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. ఐతే, తాజాగా ఆదిత్యధర్ చిత్రపరిశ్రమలోకి రావాలనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు అంటూ ఆయనపై కంగనా ప్రశంసల వర్షం కురిపించింది. సహజంగా విమర్శలు చేసే అలవాటు ఉన్న కంగనా.. ఇలా ప్రశంసలు చేయడంతో.. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఇంతకీ కంగనా ఏం మాట్లాడింది అంటే.. "ధురంధర్' విజయంలో గొప్ప విషయం ఏమిటంటే ఆదిత్య ధర్ దర్శకుడిగా స్టార్ డమ్ సంపాదించుకున్నారు. హాలీవుడ్ స్టార్ దర్శకులు ఎల్లప్పుడూ నటుల కంటే గొప్పవారు. కానీ, మనం మన దర్శకనిర్మాతలకు ఎప్పుడూ తగినంత గౌరవం, గుర్తింపు ఇవ్వము. అందుకే చాలామంది నటులు కావాలని మాత్రమే కోరుకుంటారు. ఇప్పుడు ఇక్కడ హీరోల కన్నా ఎక్కువగా వెలిగిపోతున్న ఒక సూపర్ స్టార్ దర్శకనిర్మాత ఉన్నారు. సెల్యూట్ ఆదిత్య ధర్" అని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చింది.





# బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డ 'ఉస్తాద్ భగత్ సింగ్'..

## హాలిడే సమయంలోను పుంజుకోని కలెక్షన్స్!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ఉగాది కానుకగా విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపించలేకపోతున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'గబ్బర్ సింగ్' తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రావడంతో అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆ అంచనాలకు సరిపడే స్థాయిలో వసూళ్లు రావడం లేదనే టాక్ వినిపిస్తోంది. మార్చి 19న విడుదలైన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.50 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి మంచి ఓపెనింగ్ అందుకుంది. అయితే రెండో రోజుకే కలెక్షన్స్ భారీగా పడిపోయాయి. రెండో రోజు కేవలం రూ.1112 కోట్ల మధ్యే వసూళ్లు రావడం గమనార్హం. వర్కింగ్ డే కావడంతో ఈ డ్రాప్ సహజమేనని అభిమానులు భావించారు. మూడో రోజు రంజాన్ హాలిడే ఉండటంతో కలెక్షన్స్ పెరుగుతాయని ఎగ్జిబిటర్లు, ట్రేడ్ విశ్లేషకులు ఆశించారు. కానీ ఆశ్చర్యకరంగా మూడో రోజు కూడా సినిమా పెద్దగా పుంజుకోలేకపోయింది. శనివారం రోజున ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.11 కోట్ల గ్రాస్ మాత్రమే రాబట్టడం నిరాశ కలిగించే విషయం. మొత్తంగా మూడు రోజుల్లో ఈ సినిమా రూ.73 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తుండగా, కొన్ని నివేదికలు మాత్రం రూ.63 కోట్ల పరిధిలోనే కలెక్షన్స్ ఉన్నట్లు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి కొంతవరకు మెరుగ్గా ఉన్నప్పటికీ, ఓవర్సీస్ మార్కెట్‌లో మాత్రం సినిమా బలహీనంగా కనిపిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమా 1 మిలియన్ డాలర్ల మార్క్ కూడా చేరుకోలేదని సమాచారం. సుమారు వి800ఖ వరకు మాత్రమే కలెక్షన్స్ రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం ఓవర్సీస్‌లో ఇది భారీ నష్టాలను మిగిల్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఈ సినిమా బ్రేక్ ఈవెన్ టార్గెట్ సుమారు రూ.200 కోట్ల గ్రాస్‌గా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కనిపిస్తున్న ట్రెండ్‌ను బట్టి ఆ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కనీసం ఆదివారం కలెక్షన్స్ ఎలా ఉంటాయోననే దానిపైనే ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది. రూ.100 కోట్ల మార్క్‌ను టచ్ చేస్తుందా లేదా అన్నది కూడా అదే రోజుతో క్లియర్ అవుతుందని చెబుతున్నారు. ఇక పోటీ విషయానికి వస్తే, అదే సమయంలో విడుదలైన 'ధురంధర్ 2' సినిమా మంచి వసూళ్లు రాబడుతూ ఉండటం కూడా 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ప్రభావం చూపుతున్నదని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈ సినిమా కంటే 'ధురంధర్ 2'కి మెరుగైన స్పందన రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

